ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

భద్రాద్రి కొత్తగూడెం

BHADRADRI KOTHAGUDEM

శుక్రవారం, 19 జూలై 2024



	గరిష్టం	కనిష్టం
ఖమ్మం	37	27
భద్రాద్రి	28	18


కిన్నెరసాని గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసిన దృశ్యం

అశ్వారావుపేట మండలం నారవారిగూడెం-గుర్రాలచెరువు మధ్య కొట్టుకుపోయిన రోడ్డు


సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ


పెద్దవాగు వరదలో చిక్కుకున్న వారిని హెలీకాప్టర్ ద్వారా రక్షిస్తున్న దృశ్యం

వానొచ్చే.. వరదొచ్చే..

భద్రాద్రి జిల్లాలో పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు, ప్రాజెక్టులు

- పెద్దవాగు వరదలో చిక్కుకున్న 25 మందిని హెలీకాప్టర్ ద్వారా రక్షించిన అధికారులు
- పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం
- తాలిపేరు, కిన్నెరసాని, పెద్దవాగు ప్రాజెక్టులకు వరదనీరు
- భద్రాచలం వద్ద గోదావరికి పెరిగిన వరద
- సింగరేణి ఓపెన్‌కాస్టు గనుల్లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి
- అశ్వారావుపేట మండలంలో అత్యధికంగా 16 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు
- ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ముసురు

కొత్తగూడెం (ఆంధ్రజ్యోతి)/భద్రాచలం/ఖమ్మం కార్పొరేషన్/పాల్వంచ రూరల్, జూలై 18 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గురువారం ఏకధాటిగా కుండపోత వర్షం కురిసింది. దాంతో వాగులు, వంకలు, చెరువులు, ప్రాజెక్టులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ వరదల వల్ల పలు మండలాలు, గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దమ్మపేట మండలం జమేదారుబంజరలో ఇద్దరు అన్నదమ్ములపై పిడుగు పడటంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. అశ్వారావుపేట మండలంలో అత్యధికంగా 16 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో పెద్దవాగు ప్రాజెక్టుకు భారీగా వర్షపు నీరు చేరడంతో ప్రాజెక్టు కట్టపై నుంచి వరద నీరు కిందికి పారింది. రాత్రి సమయానికి పెద్దవాగు ప్రాజెక్టు కట్టకు మూడు చోట్ల గండ్లు పడటంతో భారీగా నీరు దిగువకు వెళుతోంది. దాంతో అప్రమత్తమైన భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ దిగువన ఉన్న గ్రామాలను ఖాళీ చేయించారు. పెద్దవాగు వరదలో చిక్కుకున్న 25మంది రైతులు, కూలీలు, పశువుల కాపర్లను హెలీకాప్టర్ ద్వారా రక్షించారు. అశ్వారావుపేట మండలం అనంతారం గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఆ గ్రామంలోని 30 ఇళ్లను ఖాళీ చేయించి ప్రజలను అధికారులు బయటకు పంపించారు. మండలంలోని నారంవారిగూడెం, గుర్రాలచెరువు గ్రామాల మధ్య వరద ధాటికి రోడ్డు కొట్టుకుపోయింది. పేరాయిగూడెం సమీపంలో రాష్ట్రీయ రహదారిపై వరదనీరు ప్రవాహం ముంచెత్తింది. భద్రాచలం మార్గంలో మూడో కిలోమీటరు వద్ద ఊహించని విధంగా వరద ప్రవహిస్తోంది. భారీ వర్షంతో అశ్వారావుపేట నియోజకవర్గంలో చెరువులు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. వరద నీటితో పంట పొలాలు చెరువును తలపిస్తున్నాయి.

అశ్వాపురం మండలంలో తుమ్మలచెరువు, వెంకటాపురం గ్రామాల మధ్య లోతువాగు పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు 25గేట్లు ఎత్తి 1.48 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో కిన్నెరసాని, మల్లేడువాగులు పొంగి ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్టు కూడా భారీగా వరద చేరుతోంది. ప్రాజెక్టు నీటిమట్టం 403 అడుగులకు చేరడంతో రాత్రి మూడుగేట్లు ఎత్తి నీటిని కిందికి విడుదల చేస్తున్నారు. సుజాతనగర్ మండలం సింగభూపాలెం చెరువు అలుగు పారుతోంది. భారీవర్షంతో సింగరేణి ఓపెన్‌కాస్టు గనుల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది.

భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి

ఎగువ ప్రాంతాన కురుస్తున్న భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపి పెరుగుతోంది. బుధవారం సాయంత్రం 6గంటలకు 18.6అడుగులున్న గోదావరి నీటిమట్టం అర్ధరాత్రి ఒంటిగంటకు 20.1 అడుగులకు చేరింది. అనంతరం గంటపాటు నిలకడగా ఉన్న నీటిమట్టం స్వల్పంగా తగ్గుతూ వచ్చి గురువారం ఉదయం 6 గంటలకు 19.4 అడుగులకు చేరుకుంది. మధ్యాహ్నం 12 గంటలకు 18.6 అడుగులకు, 3 గంటలకు 18.2 అడుగులకు తగ్గి అక్కడ నుంచి ఐదు గంటల పాటు అదే నీటిమట్టం వద్ద నిలకడగా ఉంది. కాగా చర్లలోని తాలిపేరు ప్రాజెక్టు నుంచి 1.50 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేయడంతో క్రమ క్రమంగా గోదావరి నీటిమట్టం మళ్లీ పెరుగుతోంది. కాగా గోదావరి స్నానఘట్టాలపై నుంచి వరద నీరు పారుతోంది.

హెలీకాప్టర్ ద్వారా 25 మంది రెస్క్యూ

పెదవాగు ప్రాజెక్టు నిండిపోవడం, వాగు ఉధృతంగా ప్రవహించడంతో నారాయణపురం-పెదవాగు ప్రాజెక్టు మధ్య కట్టమైసమ్మ తల్లి ఆలయం సమీపంలోని రోడ్డుపై నుంచి దాటి వరద పంట పొలాల్లోకి చేరుకుంది. వరద ఒక్కసారిగా పొలాలను చుట్టుముట్టడంతో ఈ సమయంలో పొలాల్లోకి వెళ్లిన సుమారు 25మంది రైతులు, కూలీలు, పశువుల కాపర్లు బయటికి రాలేకపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వారు వాగు మధ్యలోనే ఉండిపోయి బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. ఈ విషయం తెలుసుకున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వెంటనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సీఎంవో ద్వారా ఏపీ ప్రభుత్వంతో మాట్లాడారు. హెలీకాప్టర్ తెప్పించి వరదలో చిక్కుకున్న 25మందిని సాయంత్రం బయటికి తీసుకొచ్చారు.

కిన్నెరసాని నుంచి 25వేల క్యూసెక్కుల నీరు విడుదల

పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయానికి వరదనీరు పోటెత్తి చేరుతోంది. గురువారం ఐదు గేట్లను ఎత్తి 25వేల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురవడంతోపాటు ఎగువ ప్రాంతం నుంచి కూడా వరద ప్రవాహం పెరిగింది. జలాశయం నీటిమట్టం 403.20కు చేరింది. అసలు సామర్థ్యం 407 అడుగులు కాగా, వరద ప్రవాహం పెరుగుతుండటంతో ముందస్తుగా ఐదుగేట్లను ఎత్తారు. పాల్వంచ, బూర్గంపాడు మండలాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు అధికారులు మైకు ప్రచారం నిర్వహించారు. వాగులు దాటవద్దని హెచ్చరించారు.

ఖమ్మం జిల్లాలో ముసురు

ఖమ్మం జిల్లాలో గురువారం ఉదయం నుంచి ముసురు పడుతోంది. ఇప్పటికే పత్తి విత్తనాలు నాటిన రైతులు ఈ వర్షంతో ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వర్షం లేక ట్యాంకర్లతో నీళ్లు చల్లి పంటలను కాపాడుకుంటున్న రైతులకు తాజాగా కురిసిన వర్షం ఉపశమనాన్ని కలిగించింది. జిల్లాలో గురువారం వేంసూరులో 4.3 సెంటీమీటర్లు, సత్తుపల్లి మండలం గంగారంలో 4.2సెం.మీ. వర్షపాతం నమోదైంది. అన్ని మండలాల్లోనూ ఓ మోస్తరు వర్షం కురిసింది.

అన్నదమ్ముల దుర్మరణం

- ఒకేసారి ఇద్దరిని బలిగొన్న పిడుగుపాటు
- చేపలు పట్టేందుకు వెళ్లి మృత్యువాత
- భద్రాద్రి జిల్లా జమేదారు బంజరలో ఘటన


6


మృతిచెందిన బొర్రా సిద్దు, చందు

ప్రమాదపుటంచున 'పెదవాగు'

- ఆనకట్టకు మూడుచోట్ల గండి
- పలు గ్రామాలకు పొంచివున్న వరద ముంపు
- సురక్షిత ప్రాంతాలకు ప్రజల తరలింపు
- గుమ్మడపల్లిలో నీట మునిగిన 50 ఇళ్లు
- భద్రాద్రి కలెక్టర్‌తో మాట్లాడిన సీఎస్ శాంతికుమారి
- పరిస్థితిని పర్యవేక్షిస్తున్న మంత్రి తుమ్మల


పెదవాగు ఉధృతి


పెదవాగు కట్టపై నుంచి ప్రవహిస్తున్న నీరు

అశ్వారావుపేట, జూలై 18: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని గుమ్మడపల్లి సమీపంలో గల పెదవాగు ప్రాజెక్టు కట్టకు ఎడమవైపున చివరన ఒక చోట, ప్రధాన గేట్లకు కుడిభాగంలో మరో రెండు చోట్ల గండ్లుపడ్డాయి. ఈ గండ్ల ద్వారా భారీగా ప్రాజెక్టులోని నీరు బయటికి వెళుతోంది. ప్రాజెక్టులోని నీరు గుమ్మడపల్లి గ్రామంలోకి చేరి 50 ఇళ్లకు వరకు నీరు చుట్టుముట్టాయి. తెల్లవారే సరికి గండ్లు మరింత పెరిగి కట్ట తెగిపోతే భారీ ప్రమాదం జరుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రాజెక్టు పరిస్థితిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్ జితేష్ వీ.పాటిల్‌తో మాట్లాడారు. 30 వేల మంది ప్రజలకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని కలెక్టర్ తెలపడంతో తెలంగాణ ప్రాంతాల్లోని ప్రభావిత గ్రామాల ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సీఎస్ ఆదేశించారు. దాంతో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీవో రాహుల్ ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకున్నారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడారు. అనంతరం ప్రాజెక్టు దిగువన లోతట్టులో ఉన్న గ్రామాల ప్రజలందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు.

ప్రాజెక్టు కింద ఉన్న కొత్తూరు, ఏపీలోని వేలేరుపాడు మండలంలోని కమ్మరిగూడెం సహా మొత్తం 18 గ్రామాల ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని బిక్కుబిక్కుమంటున్నారు. ప్రాజెక్టుకు ఏదైనా జరిగితే అనేక గ్రామాలతోపాటు వేలాది ఎకరాల పంట పొలాలకు తీవ్ర నష్టం జరిగే అవకాశముంది. కాగా, బచ్చువారిగూడెం వంతెనపై వాగు దాటలేక అక్కడే ఉండిపోయిన నారాయణపురానికి చెందిన 9 మందిని ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది బోటులో గురువారం రాత్రి బయటికి తీసుకొచ్చారు. ప్రాజెక్టు పరిస్థితిని, వరద సహాయక చర్యలను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యవేక్షిస్తున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పెదవాగు ప్రాజెక్టు పూర్తిగా నిండిపోయి నీరు కట్టమీద నుంచి పొంగి ప్రవహిస్తోంది. గురువారం తెల్లవారుజామునుంచి ప్రాజెక్టు పైభాగంలో భారీ వర్షాలు కురవడంతో పెదవాగు ఉగ్రరూపం దాల్చింది. ఉదయం 11గంటల సమయంలో ఇరిగేషన్ అధికారులు రెండు గేట్లు ఎత్తి 22,500 క్యూసెక్కుల నీటిని బయటికి విడుదల చేశారు. అంతలోనే ఊహించని రీతిలో పెదవాగు ఉధృతి క్షణాల్లో పెరిగిపోవడంతో ఔట్ ఫ్లోకి మించి ఇన్‌ఫ్లో కొన్ని రెట్లు ఎక్కువగా ఉండడంతో ప్రాజెక్ట్ ఒక్కసారిగా నిండిపోయి అన్నివైపులా కట్టపై నుంచి నీరు పొంగి కిందికి ప్రవహించింది. ప్రాజెక్టు మూడో గేటుకు అమర్చిన మోటార్ కాలిపోవడంతో ఆ గేటు తెరుచుకోలేదు. కట్టపైనుంచి నీరు భారీగా పొంగిపొర్లుతుండటంతో ఏ క్షణాన ఏం జరుగుతుందోననే భయంతో కట్ట కింద భాగంలో ఉన్న గుమ్మడపల్లి గ్రామస్థులు గ్రామాన్ని వదిలి మెరక ప్రాంతానికి వెళ్లిపోయారు.



ఒక యోధుడి నిష్క్రమణం

- సీపీఐ మాస్‌లైన్ అగ్రనేత రాయల చంద్రశేఖర్‌రావు బలవన్మరణం
- ఖమ్మం దానవాయిగూడెం వద్ద రాత్రివేళ రైలుకింద పడి ఆత్మహత్య
- 50 ఏళ్లుగా విప్లవ రాజకీయాలతో మమేకం
- దళనేతగా ప్రజల పక్షాన పోరాటాలు
- ప్రస్తుతం అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు
- నివాళులర్పించిన పలువురు ప్రముఖులు

6



పిండిప్రోలులో రాయల అంతిమయాత్ర

రైతులోకంలో ఆనందోత్సాహాలు

- రుణమాఫీ కింద జిల్లాలో 57,857మందికి తొలి విడత లబ్ది
- రైతు వేదికల్లో మిన్నంటిన సంబురాలు
- పలుచోట్ల సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకాలు
- వీడియో కాన్ఫరెన్సులో వీవీ పాలెం రైతుతో సీఎం మాటామంతీ




కూసుమంచిలో సంబరాల్లో పాల్గొన్న ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి. వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎంతో మాట్లాడుతున్న రైతు సీతారాం

ఖమ్మం, జూలై 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రూ.2 లక్షల రుణమాఫీ పథకం కింద ప్రభుత్వం రైతులకు బ్యాంకు ఖాతాల్లో లక్ష రూపాయల వరకు నగదు జమ చేయడంతో గురువారం రైతులు సంబరాలు జరుపుకొన్నారు. పలుచోట్ల రైతు వేదికలు కళకళలాడాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు.

జిల్లాలో 57,857మంది రైతులకు లక్ష రూపాయల లోపు లబ్ధి జరిగింది. ఇందులో ఖమ్మం నియోజకవర్గంలో 2,189, పాలేరులో 13,424, మధిరలో 15,760, సత్తుపల్లిలో 16,043, వైరాలో 8,673, ఇల్లెందు నియోజకవర్గం కామేపల్లిలో 1,768 మంది మొత్తం 57,857 మంది రైతులకు సంబంధించిన లక్ష రూపాయల లోపు అప్పులను సంబంధిత బ్యాంకులకు జమచేశారు. మరో లక్ష బకాయిలను ఆగస్టు 15లోగా రెండు దఫాలుగా జమచేయబోతున్నారు.

రుణమాఫీ అమలు సందర్భంగా హైదరాబాదు నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇతర మంత్రులు వీడియోకాన్ఫరెన్సు ద్వారా రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. రైతువేదికల వద్ద కాంగ్రెస్ పార్టీ రైతు సంఘాల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. క్షీరాభిషేకాలు, ప్రదర్శనలతో సంబరాలు జోరుగా సాగాయి. ఒకవైపు వర్షం కురుస్తుండగా మరోవైపు రైతువేదికల్లో రైతులు సంబరాలు నిర్వహించారు. వి.వెంకటాయపాలెం రైతువేదికలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, శిక్షణ సహాయ కలెక్టర్ నిర్మల్ శ్రేష్ఠ, జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేందర్, ఉద్యానశాఖ ఏడీ వెంకటరమణ పలువురు అధికారులు పాల్గొన్నారు. కూసుమంచిలో రైతుల ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీ రఘురాంరెడ్డి కూడా ట్రాక్టర్ నడిపి రైతులను ఉత్సాహపరిచారు. అంతకుముందు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఎంపీలు రేణుకాచౌదరి, రఘురాంరెడ్డి రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అమలుచేస్తున్న రుణమాఫీ రైతుల్లో ఎంతో ఆత్మస్థైర్యం నింపబోతుందని ప్రకటించారు. వైరాలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, సత్తుపల్లిలో

(మిగతా 6వ పేజీలో)

ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి కృషిచేస్తాం

- జిల్లా సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తాం
- ఖమ్మంలో యూనివర్సిటీ, కొత్తగూడెంలో కేంద్రీయ విద్యాలయం, రైల్వేలైన్ల అభివృద్ధికి కృషి
- ఎంపీలు రేణుకాచౌదరి, రఘురాంరెడ్డి

7



మీడియాతో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యురాలు రేణుక, ఎంపీ రఘురాంరెడ్డి

డీఎస్సీ పరీక్షలు షురూ

- తొలిరోజు ప్రశాంతం
- సౌకర్యాల్లేక దివ్యాంగుల వెతలు
- ఉమ్మడి జిల్లాలో 1,414మంది హాజరు



ఖమ్మం ఖానాపురం హవేలి/కొత్తగూడెం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల నియామకానికి సంబంధించిన డీఎస్సీ పరీక్షలు గురువారం ఉమ్మడి జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో కంప్యూటర్ ఆధారితంగా పరీక్షలు నిర్వహించారు. ఖమ్మంలో నాలుగు, సత్తుపల్లి, కొత్తగూడెంలో ఒక్కో పరీక్షా కేంద్రంలో అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఖమ్మం జిల్లాలో ఉదయం ఐదు పరీక్షా కేంద్రాల్లో 855మందికిగాను 758మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నాలుగు పరీక్ష కేంద్రాల్లో 651 మందికి 544మంది హాజరయ్యారని డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. కేంద్రాల వద్ద కనీసం టెంట్‌లు ఏర్పాటు చేయకపోవటంతో అభ్యర్థుల కుటుంబసభ్యులు వర్షంలోనే తడుస్తూ చెట్లకింద వేచి ఉన్నారు. కాగా, నగరంలోని ఎస్‌బీఐటీ పరీక్షా కేంద్రానికి మోహన్ అనే అభ్యర్థి రెండు నిమిషాలు ఆలస్యంగా రావటంతో అధికారులు లోనికి అనుమతించలేదు. వర్షం కారణంగా ఆటోలు దొరకలేదని అభ్యర్థి వేడుకున్నా అధికారులు అంగీకరించకపోవడంతో వెనుదిరిగాడు.

దివ్యాంగులకు కష్టాలు

డీఎస్సీ పరీక్షకు హాజరైన దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించటంలో అధికారులు విఫలమయ్యారు. నగరంలోని ఓ పరీక్షా కేంద్రంలో దివ్యాంగులకు ప్రత్యేకంగా పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కానీ ఈ కేంద్రం మొదటి, రెండో అంతస్తుల్లో ఏర్పాటు చేయటంతో దివ్యాంగులు మెట్లు ఎక్కలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దివ్యాంగుల కోసం వీల్ చైర్స్ ఏర్పాటు చేయకుండా అభ్యర్థుల వెంట వచ్చిన వారితోనే పరీక్షా కేంద్రాల వద్దకు పంపించారు. మొత్తం 30 మంది దివ్యాంగులకు 20మంది పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం నుంచి జరిగే పరీక్షలకైనా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని దివ్యాంగులు కోరుతున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో...

భద్రాద్రి జిల్లాలో గురువారం అబ్దుల్ కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో 129మంది విద్యార్థులకుగాను 112మంది హాజరయ్యారు. అంగవైకల్యం కలిగిన విద్యార్థులకు 8మందికిగాను ఏడుగురు హాజరయ్యారు. కాగా, ఈ పరీక్షలు ఆగస్టు 5వ తేదీ వరకు జరగనున్నాయి.



లక్కీడ్రా నిర్వహిస్తున్న ఆర్ఎం సరిరాం

ఆర్టీసీ లక్కీడ్రా విజేతల ఎంపిక

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 18: 'లక్షే లక్ష్యం' కార్యక్రమంలో భాగంగా జూన్ 1 నుంచి 16వరకు డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళా ప్రయాణికులకు లక్కీడ్రా స్కీమ్ ద్వారా విజేతలను ఎంపిక చేశారు. గురువారం నగరంలోని సిటీ బస్టాండ్‌లో రీజనల్ మేనేజర్ సరిరాం ఆధ్వర్యంలో ఖమ్మం-భద్రాచలం, సత్తుపల్లి-విజయవాడ, మధిర-హైదరాబాద్, మణుగూరు-హైదరాబాద్ రూట్‌లలో ప్రయాణించిన మహిళా ప్రయాణికులకు లక్కీడ్రా నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. విజేతలకు ఈ నెల 25న నగరంలోని నూతన బస్టాండ్ ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి బహుమతులు అందిస్తామని ఆర్ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్), ఉద్యోగులు, సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈవో

'విద్యాశాఖ' సిబ్బంది బదిలీల కౌన్సెలింగ్ పూర్తి

ఖమ్మం ఖానాపురంహవేలి జూలై 18:విద్యాశాఖలో జూనియర్ అసిస్టెంట్స్, రికార్డ్ అసిస్టెంట్స్ ఆఫీస్ సబార్డినేట్స్‌ల బదిలీల కౌన్సెలింగ్ పూర్తయిందని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ తెలిపారు.గురువారం కౌన్సెలింగ్ ప్రక్రియను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నిబంధనల ప్రకారం ప్రశాంతంగా నిర్వహించినట్లు డీఈవో తెలిపారు. కార్యాలయంలోని 19 మంది జూనియర్ అసిస్టెంట్స్, 8మంది రికార్డ్ అసిస్టెంట్స్, 15మంది ఆఫీస్ సబార్డినేటర్స్ ఎంచుకున్న ఆప్షన్ ప్రకారం స్థానచలనం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకుడు శ్రీధర్‌బాబు, సెక్షన్ సిబ్బంది దేవేందర్, ఎన్.శ్రీనివాస్, ఉద్యోగ సంఘం నాయకులు ఎస్.ప్రసాద్, యూసుఫ్ అహ్మద్, కె.మాధవరావు, నగేష్ తదితరలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ఓవర్‌సీస్ పథకం

దరఖాస్తులకు 7వరకు గడువు

ఖమ్మం ఖానాపురంహవేలి జూలై 18: ఖమ్మం జిల్లాలోని క్రైస్తవ, మైనారిటీ విద్యార్థులకు ముఖ్యమంత్రి ఓవర్ సీస్ పథకం 2024 సంవత్సరం (జనవరి 1, 2024 నుంచి జూలై 31 2024)వరకు విదేశీ యూనివర్శిటీలలో పీజీ, పీహెచ్‌డీ అడ్మిషన్లు పొంది, అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్లో ఆగస్టు 7లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి యంఏ మహమ్మూది తెలిపారు. దరఖాస్తుతోపాటు సంబంధిత ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తోపాటు మూడు జతల జిరాక్స్ ప్రతులతో ఆగస్టు 7న జిల్లా మైనారిటీ కార్యాలయంలో అందించాలని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రూ.20లక్షల ఉపకార వేతనం, రెండు విడతల్లో, రూ. 60వేల వరకు విమాన చార్జీలకు చెల్లించటం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాలి

జిల్లా గ్రంథాలయంలో యువతతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం ఖానాపురంహవేలి/ఖమ్మం మార్కెట్, జూలై 18: లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం కలెక్టర్ ఖమ్మం నగరంలోని జిల్లా గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతీ, యువకులతో మాట్లాడి వారి సమస్యలు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పుడూ శ్రమపై దృష్టి పెట్టాలని, అప్పుడే ఫలితం వస్తుందని సూచించారు. ఒకరికొకరు సహకరించుకోవాలని తమకు తెలిసిన విషయాలను పంచుకోవాలని అన్నారు.

నిరాశ, నిస్పృహలకు లోనుకావొద్దని ఆశావహ దృక్పతంతో ముందుకెళ్లాలని పేర్కొన్నారు. పరిస్థితులు లక్ష్య సాధనకు అడ్డంకులు కావని, అవకాశాలను విజయాలుగా మలచుకోవాలని అన్నారు. చదువుతోపాటు వ్యాయామం, క్రీడలకు సమయం కేటాయించాలని తెలిపారు. గ్రంథాలయంలో టాయిలెట్లు, తాగునీటి సమస్యతోపాటు మరి ఏ ఇతర సౌకర్యాల కల్పనకు సంబంధించి అంశాలను నా దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు, సిబ్బంది, పాల్గొన్నారు.



గ్రంథాలయంలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్



కూరగాయల స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను సందర్శించిన కలెక్టర్

నగరంలోని బ్యాంక్‌కాలనీ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను గురువారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో తిరుగుతూ కొనుగోళ్లను పరిశీలించారు. మహిళా రైతులతో ముచ్చటించి ఏమైనా సమస్యలు ఉంటే తెలపమని అడిగారు. ఈ సందర్భంగా వారు కూరగాయల స్టాళ్లను ప్రస్తుతం ఉన్న చాంబర్ తరహాలో కాకుండా ఓపెన్ ప్లాట్‌ఫాం మాదిరిగా ఉండాలని మహిళా రైతులు కలెక్టర్‌కు తెలిపారు. దీంతో ఆయన స్పందించి కూరగాయల మార్కెట్‌లో స్టాళ్ల వద్ద వెంటనే పైలట్ ప్రాజెక్టుగా రెండు దుకాణాలకు సరిపడే విధంగా ఓపెన్ ప్లాట్‌ఫాం నిర్మించాలని సూచించారు. అనంతరం తాళం వేసి ఉన్న నాన్‌వెజ్ మార్కెట్ షెడ్డును పరిశీలించి ఇక్కడకు మాంసం వ్యాపారులు ఎందుకు రావడంలేదని అధికారులను ప్రశ్నించారు. మాంసం వ్యాపారులు ఇక్కడకు వచ్చి వ్యాపారం చేసే విధంగా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అలీం, రైతుబజార్ పర్యవేక్షకురాలు శ్వేత, కాంగ్రెస్ నాయకుడు మిక్కిలినేని నరేంద్ర, పలువురు రైతులు ఉన్నారు.

జర్నలిస్టులకు రైల్వే పాసులు

పునరుద్ధరించాలి

- రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరికి విజ్ఞప్తి
- రైల్వేశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ


ఖమ్మం, జూలై 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జర్నలిస్టులకు రైల్వే రాయితీ సౌకర్యాన్ని తిరిగి పునరుద్ధరించాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ ఆధ్వర్యంలో కేంద్ర మాజీమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరికి గురువారం వినతిపత్రం అందించారు. కొవిడ్‌కు ముందు జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు 50 శాతం రాయితీపై రైల్వే ప్రయాణ సౌలభ్యం ఉండేదని, కొవిడ్ తరుణంలో అన్ని రాయితీలు రద్దు చేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి రైల్వేశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పాసుల సదుపాయాన్ని పునరుద్ధరింపచేయాలని విన్నవించారు.

ఈ బడ్జెట్ సమావేశాల్లోనే జర్నలిస్టుల రైల్వే పాసు సమస్యలపై మాట్లాడతానని కేంద్రమంత్రి దృష్టికి కూడా తీసుకువస్తానని రేణుకాచౌదరి హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యుడు మాటేటి వేణుగోపాల్, జిల్లా నాయకులు నలజాల వెంకటరావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, టీయూడబ్ల్యూజే ఐజేయూ నగర అధ్యక్ష కార్యదర్శులు మైస పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్, ఏలూరి వేణుగోపాల్, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు. అంతకుముందు టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్రమహాసభల మెమోంటోను కూడా రేణుకాచౌదరికి అందించారు.

శిథిలావస్థలో చెరుపల్లి పాఠశాల

- శ్లాబు పెచ్చులూడి పడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- ప్రమాదంలో విద్యార్థులు.. భయపడుతున్న తల్లిదండ్రులు

దుమ్ముగూడెం జూలై 18: మండలంలోని చెరుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షాలకు తరగతి గదులు లీకవుతూ, విద్యార్థులు కూర్చోడానికి సైతం ఇబ్బంది కలుగుతోంది.



ప్రమాదకరంగా శ్లాబు



కురుస్తున్న తరగతి గది

అలాగే భవనం శ్లాబు దిగువ భాగంలో సిమెంటు పెచ్చులూడి కింద పడుతున్నాయి. తుప్పు పట్టిన శ్లాబు ఊచలు దర్శనమిస్తున్నాయి. గోడల నుంచి వర్షపునీరు దిగడంతో అవి చెమ్మగిల్లి ప్రమాదకర స్థితిలో కనబడుతున్నాయి. చెరుపల్లి పాఠశాల ఆర్‌సీసీ భవనం 1994లో నిర్మించగా, అంతకుముందే ఒక రేకుల షెడ్డులో పాఠశాల నడుస్తుండేది. ప్రస్తుతం నలభై ఐదు మంది విద్యార్థులు చదువుతోన్న ఈ పాఠశాల భవనాల్లోని తరగతి గదులు వర్షానికి కురుస్తుండగా, విద్యార్థులు కూర్చోడానికి సరైన స్థలం కూడా లేదు. శ్లాబు దిగువభాగంలో పెచ్చులూడి ప్రమాదకరస్థితిలో ఉండగా, ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని దుస్థితిలో అక్కడ విద్యాబోధన జరుగుతోంది. పాఠశాల తరగతి గదుల దుస్థితిని చూసి భయపడిన కొందరు తల్లిదండ్రులు తమ పిల్లల్ని వ్యయ ప్రయాసల కోర్చి ఇతర బడుల్లో చేర్పించగా, మరి కొందర్ని పాఠశాల మాన్పించినట్లు సమాచారం.

మరమ్మతులు చేపట్టాలి

పాఠశాల భవనాలకు వెంటనే మరమత్తులు చేపట్టాలని గ్రామ యువత సయ్యద్ మున్నా, ముర్రం రాంబాబు, కాక ప్రవీణ్, రేసు భరత్, కాక లక్ష్మణ్, కాక వెంకటేష్‌లు అధికారులను కోరారు. కూలిపోయే స్థితిలో ఉన్న తరగతి గదుల్లో విద్యార్థులు బిక్కు బిక్కుమంటూ చదువుకునే దుస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేతో పాటు మండల స్థాయి అధికారులకు సమాచారం ఇచ్చినా ప్రయోజనం కలగలేదని తెలిపారు.



మరమ్మతులు చేపట్టాలంటున్న యువత

ఒక యోధుడి నిష్క్రమణం

● సీపీఐ మాస్‌లైన్ అగ్రనేత రాయల చంద్రశేఖర్‌రావు బలవన్మరణం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 18: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ అగ్రనేత రాయల చంద్రశేఖర్ రావు(75) ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పార్టీ శ్రేణుల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. వ్యక్తిగత కారణాలతో ఆయన మంగళవారం రాత్రి ఖమ్మం దానవాయిగూడెం ప్రాంతంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే పోలీసులు తొలుత గుర్తుతెలియని వ్యక్తిగా భావించి మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బుధవారం రాత్రి అతడి వివరాలు తెలియడంతో రైల్వే పోలీసులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. చంద్రశేఖర్‌రావు మృతి విషయం తెలియగానే కమ్యూనిస్టు విప్లవ శ్రేణులు విషాదంలో మునిగిపోయాయి. ఆయన ఆత్మహత్య చేసుకున్నారనే విషయం తెలిసి నివ్వెరపోయాయి.

చంద్రశేఖర్‌రావు భౌతికకాయాన్ని గురువారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆధ్వర్యంలో నగరంలోని పార్టీ కార్యాలయానికి తరలించి కొన్ని గంటల పాటు ప్రజల సందర్శనార్థం ఉంచారు. కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, ఎంపీ రఘురాంరెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎన్డీ జాతీయ కార్యదర్శి చంద్రన్న, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా సమితి కార్యదర్శి పోటు ప్రసాద్, ఎన్డీ రాష్ట్ర నాయకులు సాదినేని వెంకటేశ్వరరావు తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు. చంద్రశేఖర్‌రావు మృతిపట్ల మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, తదితరులు ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు.

కమ్యూనిస్టు విప్లవ రాజకీయ కుటుంబం

తిరుమలాయపాలేం మండలం పిండిప్రోలుకు చెందిన రాయల గోపాలకృష్ణ, రాయల వెంకటనారాయణ సోదరులు. వీరు తెలంగాణ సాయుధ పోరాటంలో కీలకంగా వ్యవహరించారు. గోపాలకృష్ణకు నలుగురు సంతానం. అప్పయ్య, సుభాస్‌చంద్రబోస్, నాగేశ్వరరావు, చంద్రశేఖర్. తండ్రి, పెదనాన్న విప్లవ ఆశయాలతో 1967లో జరిగిన నక్సల్బరి ఉద్యమంతో రాయల సుభాష్‌చంద్రబోస్(రవన్న) అజ్ఞాతంలోకి వెళ్లారు. 1970 నుంచి రహస్య జీవితం గడిపారు. 50ఏళ్ల పాటు సీపీఐ(ఎంఎల్)పార్టీలో కీలకంగా పనిచేశారు. 25ఏళ్ల పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. 2016లో బ్రెయిన్ స్ట్రోక్‌తో రవన్న కన్నుమూశారు. రాయల అప్పయ్య విప్లవ స్ఫూర్తితో ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. రాయల నాగేశ్వరరావు అదే విప్లవస్ఫూర్తితో పనిచేసి స్వగ్రామంలో నాయకుడిగా ఎదిగారు. పిండిప్రోలు గ్రామానికి దశాబ్దకాలం పాటు సర్పంచ్‌గా పనిచేశారు.

అందరికంటే చిన్నవాడైన చంద్రశేఖర్‌రావు కూడా అన్న సుభాష్‌చంద్రబోస్ స్ఫూర్తితో అజ్ఞాతబాట పట్టారు. గత 50 ఏళ్లుగా విప్లవ రాజకీయాల్లో ఉన్నారు. విద్యార్థి దశ నుంచే విప్లవోద్యమానికి ఆకర్షితుడై పీడీఎస్‌యూలో కీలకంగా పనిచేశారు. తన సోదరుడు రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) ఉద్యమబాటను అనుసరించి 1975లో రహస్య కార్యకర్తగా అడవి బాట పట్టారు. మణుగూరు, అశ్వాపురం, సత్తుపల్లి అటవీ ప్రాంతాల్లోని దళాల్లో క్రియాశీలకంగా పనిచేశారు. పలు ఎన్‌కౌంటర్ల నుంచి తప్పించుకున్నారు. విప్లవోద్యమ నిర్మాణానికి ఊపిరిపోశారు. ఇల్లెందు ప్రాంతంలో ప్రజాప్రతిఘటన ఇతర నక్సల్స్ గ్రూపుల దాడులను తిప్పికొట్టడానికి రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఇల్లెందు దళాల ఏరియా పొలిటికల్ ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. ఆ తర్వాత రైతు కూలీ సంఘం నాయకుడిగా మైదానంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలో పార్టీ నిర్మాణానికి కృషి చేశారు. పార్టీ పత్రిక నిర్వహణలో కీలకబాధ్యతలు నిర్వహించారు. ఏపీ రైతు కూలీ సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు.

అజ్ఞాతంలో పనిచేస్తున్న కాలంలోనే తనతో పాటే పనిచేస్తున్న విమలతో పరిచయం ఏర్పడింది. ఒకరి ఆదర్శాలు మరొకరికి నచ్చటంతో దళంలోని పెద్దల సమక్షంలో 1976లో వివాహం జరిగింది. వీరికి ఒక బాబు జన్మించాడు. మ్యాక్సిం గోర్కి. నవల 'ది మదర్' లోని కార్మిక నేత పావెల్ పేరునే తమ కుమారుడికి పెట్టుకున్నారు. 1997 వరకు విమల పార్టీలో కీలకంగా పనిచేశారు. ఆ తర్వాత నుంచి గృహిణిగా ఉంటున్నారు.



రాయల చంద్రశేఖర్‌రావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, ఎంపీ రఘురాంరెడ్డి,

కన్నీటి వీడ్కోలు

తిరుమలాయపాలెం: చంద్రశేఖర్‌రావు అంత్యక్రియలు ఆయన స్వగ్రామం పిండిప్రోలులో గురువారం అశ్రునయనాల మధ్య జరిగాయి. వివిధ గ్రామాలు పలుజిల్లాల నుంచి కార్యకర్తలు, బంధువులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయలో సంతాపసభ నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ చంద్రశేఖర్‌రావు మరణం పార్టీకి తీరనిలోటన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాయల కుటుంబం మొత్తం ప్రజా జీవితానికి అంకితం చేశారని, వారి కుటుంబం అంతా త్యాగాల కుటుంబం అన్నారు.

కాగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పుసులూరి నరేందర్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమలో పార్టీ నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య పోటు సూర్యం, కేపీ రాంచందర్, కె.రంగయ్య, గోకిపల్లి వెంకటేశ్వరరావు, సాధినేని వెంకటేశ్వరరావు, గోవర్ధన్, మధు, కె.నాగేశ్వరరావు, తిమ్మిడి హనుమంతరావు, బందెల వెంకయ్య, సీవై పుల్లయ్య, వై.నవీన్, సంధ్య, సరోజిని, శిరోమణి, కాంగ్రెస్ నాయకులు జడ్పీటీసీ బెల్లం శ్రీను, మద్దినేని మధు తదితరులు పాల్గొన్నారు.

రైతులోకంలో

ఆనందోత్సాహాలు

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యే మట్టా రాగమయి సంబరాలలో పాల్గొన్నారు. అన్ని మండలాల్లోని రైతు వేదికల్లో రైతు రుణమాఫీ సంబరాలు నిర్వహించారు.

రైతుతో సీఎం ముఖాముఖీ

రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం రైతువేదిక నుంచి ఆ గ్రామానికి చెందిన సీతారాం అనే రైతుతో వీడియో కాన్ఫరెన్సులో సీఎం మాట్లాడారు. రైతు రుణమాఫీ పట్ల సీఎం రేవంత్‌రెడ్డి రైతు సీతారాంను స్పందన ఏంటని అడగ్గా... 'రుణమాఫీ ఆనందంగా ఉంది.. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది, రుణమాఫీ ద్వారా యువరైతులు కూడా వ్యవసాయాన్ని కొనసాగించే అవకాశం ఉంటుంది. రైతు రు ణమాఫీ చేయాలనే సంకల్పాన్ని అమలు చేసినందుకు మీకు కృతజ్ఞతలు..' అని తెలిపాడు.

ఈ సందర్భంగా సీఎం 'ఎన్ని ఎకరాలు భూమి ఉంది..? ఎంత రుణమాఫీ అయింది..?' అని అడగ్గా, 'ఎకరన్నర భూమి ఉంది.. రూ.75వేల రుణమాఫీ అయింది..' అని బదులిచ్చాడు. ఒకేసారి రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది, మా యువరైతులు ప్రభుత్వానికి రుణపడి ఉంటారని, వ్యవసాయం మరింతగా చేయాలనే సంకల్పం ఈ ప్రభుత్వం సాకారం వల్ల కలిపించారని మీరు చల్లగా ఉండాలని, రైతు సీతారాం తెలిపాడు.

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆదర్శంగా తీసుకుని వ్యవసాయం చేస్తున్నాం.. సారు పొద్దున లేస్తే చేలో ఉండి వ్యవసాయం చేస్తున్నారు.. ఆ సంకల్పంతో మేం కూడా వ్యవసాయం చేస్తున్నాం.. అని తెలిపాడు. సీఎం జోక్యం చేసుకొని 'ఎంతమంది పిల్లలు..?' అని అడగ్గా 'నాకు ఇద్దరు పాపలు.. ఒకరు ఇంటర్, మరొకరు పదో తరగతి చదువుతున్నారు..' అని తెలిపాడు. అందుకు సీఎం రేవంత్‌రెడ్డి బదులిస్తూ పిల్లలను బాగా చదివిస్తేనే భవిష్యత్ బాగుంటుందని అన్నారు.

భద్రాద్రి జిల్లాలో...

కొత్తగూడెం (ఆంధ్రజ్యోతి) : రైతు రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రైతులతో సంభాషించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు నియోజకవర్గం సుదిమళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు వేదిక నుంచి ఎమ్మెల్యే కోరం కనకయ్య జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా వ్యవసాయశాఖాధికారి బాబురావు, జిల్లా ఉద్యానవనశాఖాధికారి సూర్యనారాయణ, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

అన్నదమ్ములను బలిగొన్న పిడుగు

- చేపలు పట్టేందుకు వెళ్లి మృత్యువాత
- జమేదారు బంజరలో ఘటన



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట, జూలై 18: పిడుగుపాటుకు గురై ఇద్దరు సోదరులు మృతి చెందిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం జమేదారుబంజర గ్రామంలో గురువారం జరిగింది. జమేదారుబంజరు గ్రామానికి చెందిన బొర్రా సిద్దూ(15), బొర్రా చందు(11) వారి తల్లిదండ్రులు బొర్రా మల్లేష్, నాగమణి, అదే గ్రామానికి చెందిన మరి కొం త మందితో కలిసి వర్షంలోనే గ్రామంలోని పుల్లయ్య చెరువుకు చేపలు పట్టేందుకు వెళ్లారు. తలిదండ్రులు చేపలు పడుతుండగా చందు, సిద్దు కొంతదూరంలో గట్టుమీద ఉండి చూస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా పిడుగు పడడంతో వారిద్దరు అక్కడిక్కడే మృతి చెందారు. పిడుగు తీవ్రతకు సిద్దూ శరీరం కొద్దిమేర కాలింది. చందు అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 5వతరగతి చదువుతున్నాడు. అతని సోదరుడు సిద్దు 7వ తరగతి వరకు దమ్మపేట మండలంలో చీపురగూడెం పాఠశాలలో చదవగా ఈ ఏడాది పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్ద ఉంటున్నట్లు సమాచారం. తమ ఇద్దరు పిల్లలు మృతి చెందటంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కాగా, పిడుగుపాటుతో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు సోదురులు మృతిచెందిన విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ ఘటనపై ఆరా తీశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాల్సిందిగా కలెక్టర్‌ను ఆదేశించారు.

రాష్ట్ర రైతాంగానికి ఇది పండుగ రోజు

● ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి ఇది పండుగ రోజు లాంటిదని, రైతుల కష్టాన్ని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం రుణాలు మాఫీ ప్రక్రియ చేపట్టి ఇచ్చిన హామీని అమలు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని సుజాతనగర్ మండల రైతు వేదికలో రుణమాఫీ సందర్భంగా ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులతో జరిగిన వీడియోకాన్ఫరెన్స్ సమావేశంలో రైతులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల తరపున వారు తీసుకున్న రుణాల మాఫీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 31కోట్లు విడుదల చేయనుందని, మొదటి దఫాగా రూ.7వేల కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ఎలాంటి జాప్యం లేకుండా 2, 3వ విడత రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేసి హామీని నిలపెట్టుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. రుణమాఫీ విషయంలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తితే సంబంధిత అధికారులు, బ్యాంకర్లు త్వరితగతిన సరి చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతులకు నష్టం చేసే నిబంధనలు సడలించి ప్రతి రైతుకు న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూక్య పద్మవతి, సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు, మండల వ్యవసాయ అధికారి జి. నర్మదా, సీపీఐ మండల కార్యదర్శి భూక్యా దస్రు, మాజీ వ్యవసాయ మార్కెట్‌కమిటీచైర్మన్ రాంబాబు, సీపీఐ మండల సంయుక్తకార్యదర్శి కుమారి హనుమంతరావు, రైతులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు స్వీట్ తినిపిస్తున్న నాయకులు



రుణమాఫీ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ బ్రహ్మయ్య

కొత్తగూడెం: రైతు రుణమాఫీ 2024 నిధుల విడుదల కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రైతులతో కలిసి అధికారులు భేటి అయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇల్లెందు నియోజకవర్గం సుదిమళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు వేదిక నుంచి ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా వ్యవసాయశాఖాధి కారి బాబురావు, జిల్లా ఉద్యానవనశాఖాధికారి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎమ్మెల్యే కోరం కనకయ్య, రైతులు

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

● డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య

అశ్వాపురం, జూలై 18: రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య అన్నారు. రైతురుణమాఫీ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని మల్లెలమడుగు రైతు వేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన రైతులనుద్దేశించి మాట్లాడారు. ఒకేరోజు 11లక్షలమంది రైతుల ఖాతాల్లో రూ.6,098కోట్ల ను జమచేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదేనన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ, మండల కోఆప్షన్ సభ్యుడు ఖదీర్, నరేష్, నెల్లిపాక సింగిల్‌విండో చైర్మన్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి, ఏవో సాయి శంతన్‌కుమార్ పాల్గొన్నారు.

పేదలకు అండగా టీడీపీ

● పొలిట్‌బ్యూరో సభ్యుడు నర్సింహులు



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహులు

ఇల్లెందుటౌన్, జూలై 18: తెలంగాణలో టీడీపీ బలమైన పార్టీగా ఎదుగుతుందని పేదలకు అండగా ఉంటుందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు పేర్కొన్నారు. గురువారం ఇల్లెందులో టీడీపీ జెండాపండుగతో పాటు నియోజకవర్గ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఈ ప్రాంతంలో ఎంతో బలంగా ఉందని, ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో ముందుకు సాగుతుందని వివరించారు. గతంలో ఇక్కడ ఎమ్మెల్యే, మున్సిపాల్టీ గెలిచిన సందర్భాలు ఉన్నాయని వివరించారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పటిష్టమవుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇల్లెందు నియోజక వర్గ ఇన్‌చార్జి ముద్రగడ వంశీ, మహబూబాబాద్, ఖమ్మం పార్లమెంట్ అధ్యక్షులు కొండపల్లి రామచంద్రరావు, వాసిరెడ్డి రామనాధ, పాలేరు, అశ్వారావుపేట, నియోజకవర్గ ఇన్‌చార్జులు కొండబాల కరుణాకర్, కాట్రం స్వామిదొర, వట్టం నారాయణ, మల్లెంపాటి అప్పారావు, చందావత్ రమేష్‌బాబు, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

మధిరటౌన్, జూలై18: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం మొగులూరు నుంచి ఖమ్మం వెళుతున్న ఇసుక లారీని మధిర పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు లారీ లో ఇసుక ఉన్న విషయాన్ని గ్రహించి లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్ మహ్మద్ పకీర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సంధ్య తెలిపారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా

అభివృద్ధికి కృషి చేస్తాం

- సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తాం
- ఖమ్మంలో యూనివర్సిటీ, కొత్తగూడెంలో కేంద్రీయ విద్యాలయం, రైల్వేలైన్ల అభివృద్ధికి కృషి
- ఎంపీలు రేణుకాచౌదరి, రఘురాంరెడ్డి

ఖమ్మం, జూలై 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాజ్యసభ, లోక్‌సభ ఎంపీలుగా ఉమ్మడి ఖమ్మం జిల్లా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని, జిల్లా సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తామని రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, ఖమ్మం లోక్‌సభ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి వెల్లడించారు. ఖమ్మం నగరానికి వచ్చిన ఇద్దరు ఎంపీలు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేసి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం నిలబెట్టుకుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు ఏఐసీసీ నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలు వరంగల్ డిక్లరేషన్ సభలో రుణమాఫీకి హామీ ఇచ్చారని, ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అమల్లోకి తేవడం అభినందనీయమన్నారు. తద్వారా రైతుల్లో మరింత భరోసా పెరుగుతుందని, తెలిపారు.

పార్లమెంట్ సభ్యులుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులను, పథకాలను పనులను జిల్లాకు సత్వరం వచ్చేలా కృషిచేస్తామని తెలిపారు. ఖమ్మంలో యూనివర్శిటీ, కొత్తగూడెంలో కేంద్రీయ విద్యాలయం, కొత్తగూడెం-కొవ్వూరు రైల్వేలైన్, భద్రాచలం-పాండురంగాపురం రైల్వేలైన్, ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు చొరవ తీసుకుంటామని పాలేరు జలాశయంలో నౌకాదళం ద్వారా సెయిలింగ్ యూనిట్ ఏర్పాటు చేయిస్తామని ఇప్పటికే నేవీ అధికారులను సంప్రదించడం జరిగిందని తెలిపారు. పాలేరులో ఫిషరీష్ కళాశాల, ఖమ్మంలో వెటర్నరీ కళాశాల, సెంట్రల్ టూల్ డిజైన్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు చొరవ తీసుకుంటామని ఖమ్మం లైబ్రరీని అధునాతన వసతులతో ఐఏఎస్, ఐపీఎస్ స్టడీ సర్కిల్ వలే స్టడీ అకాడమి స్థాయిలో తీర్చిదిద్దుతామన్నారు.

ఖమ్మంలో ఇరాడియేషన్ కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన పంట నాణ్యత ప్రమాణాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే భద్రాచలన్ని ఆనుకుని ఏపీ పరిధిలో ఉన్న ఐదు గ్రాపంచాయతీలను కేంద్రం ప్రత్యేక ఆర్డినెన్సు ద్వారా తెలంగాణలో కలిపి భద్రాచలం అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో పార్లమెంట్‌లో కూడా ప్రస్తావిస్తామని గతంలో ప్రత్యేక ఆర్డినెన్సు ద్వారా ఆంధ్రాలో ఈ మండలాలను విలీనం చేశారని గుర్తు చేశారు. రాబోయే లోక్‌సభ సమావేశాల్లో కూడా ప్రస్తావిస్తామని తెలిపా రు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం జర్నలిస్టులకు సత్వరం ఇళ్లస్థలాలు ఇచ్చేలా జిల్లా అధికారులతో మాట్లాడడం జరుగుతుందన్నారు అలాగే జర్నలిస్టులకు రైల్వేపాసుల పునరుద్ధరణపై కేంద్ర రైల్వేశాఖ మంత్రితో మాట్లాడతానన్నారు ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, మట్టా రాగమయి, మాలోతు రాందాస్ నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, మానుకొండ రాధాకిషోర్, దీపక్‌చౌదరి, వడ్డెబోయిన నర్సింహారావు, జలీల్‌ఖాన్ పాల్గొన్నారు.

మణుగూరులో భారీ వర్షం..

- సింగరేణి బొగ్గు ఉత్పత్తికి ఆటంకం...

మణుగూరుటౌన్, జూలై 18: మణుగూరు ఏరియాలోని సింగరేణి గనుల్లో బొగ్గు ఉత్పత్తికి, ఓబీ వెలికితీత పనులకు వర్షం తీవ్ర ఆటంకం కలిగిస్తోంది. జూలై మొదటి రోజు నుంచి వరుసగా 17 రోజుల పాటు 476 ఎంఎం వర్షపాతం నమోదైంది. దీంతో ఏరియాలో వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకుని సంస్థ నిర్దేశించికున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తున్నప్పటికీ ఓబీ వెలికితీత లక్ష్యాలను మాత్రం సాధించలేకపోయింది. మొత్తంగా ఏరియాలో జూలై మాసంలో గురువారానికి 14 రోజులు పాటు కురిసిన వర్షలు ఉత్పత్తి, ఉత్పాదకతలపై ప్రభావం చూపించింది. దీంతో 17 నాటికి ఏరియా యాజమాన్యం నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తికి సంబంధించి 126 శాతం ఉత్పత్తి సాధించి 122 శాతం బొగ్గు రవాణాను సాధించింది.



చిత్తడిగా గని అంతర్గత రహదారి

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి: సీపీ



బాధితులతో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

బోనకల్, జూలై 18: పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. గురువారం మండలంలోని పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితుల ఫిర్యాదుల గురించి అడిగారు. రికార్డులను పరిశీలించారు. రౌడీ షీట్‌తో పాటు నేర ప్రవృత్తి గల వారి వివరాలను పరిశీలించారు. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం కావడంతో చేపట్టాల్సిన కార్యచరణ గురించి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. నిరంతరం గస్తీ నిర్వహించాలని, మాదక ద్రవ్యాల వినియోగం, నియంత్రణ, సరఫరా పై దృష్టి సారించాలని సూచించారు. విద్యా సంస్థల్లో విద్యార్థులు మత్తు పదార్థాల బారీన పడకుండా అవగాహన సదస్సులు, ర్యాలీలను నిర్వహించాలన్నారు. ఫిర్యాదులను పరిశీలించి, కేసుల నమోదులో నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు. ప్రతి కేసులో లోతైన విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని, సైబర్ క్రైమ్ గురించి ప్రజలల్లో చైతన్యం కలిగించాలన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రైతు ఆత్మహత్య కేసులో నిందితులకు బెయిల్ నిరాకరణ

ఖమ్మం లీగల్ జూలై 18: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన చింతకాని మండలానికి చెందిన రైతు బోజడ్ల ప్రభాకర్ ఆత్మహత్య కేసులో నిందితులు పెంట్యాల నాగుల్‌మీరా, గుడిపూడి రజనీకాంత్ లకు బెయిల్ నిరాకరిస్తూ ఖమ్మం రెండవ అదనపు జిల్లా న్యాయాధికారి ఇంచార్జ్ డి.రాంప్రసాదరావు గురువారం తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన కొంతమంది తన వ్యవసాయభూమిని జేసీబీ, ప్రొక్లైన్‌లతో దున్నివేశారని అది వ్యవసాయానికి అనుకూలంగా లేకుండా పోయిందని మృతుడు బోజడ్ల ప్రభాకర్ ఈ నెల2న ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా మృతుడు తండ్రి ఈ విషయమై ఫిర్యాదుచేయగా పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా, కేసును విచారించిన న్యాయాధికారి బెయిల్ నిరాకరించారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెల్లం ప్రతాప్‌రావు వాదనలు వినిపించారు.

పర్ణశాల పీహెచ్‌సీని సందర్శించిన పీవో

దుమ్ముగూడెం, జూలై 18: చినబండిరేవు పీహెచ్‌సీను ఎంసీహెచ్ పీవో డాక్టర్ చైతన్య గురువారం సందర్శించారు. బాలింతరాలిని పరీక్షించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రాపిడ్ ఫీవర్, యాంటీ లారా సర్వే వివరాలను తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. ఆయన వెంట వైద్యాధికారి రేణుకారెడ్డి, పీహెచ్ఎన్ వెంకటనర్సమ్మ, హెచ్ఏ నాగేశ్వరావు, కృపారాణి పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన ముత్యాలంపాడు డైవర్షన్ రోడ్డు

- ఆరు గ్రామాలకు రాకపోకలు బంద్
- జ్వరంతో బాధపడుతున్న చిన్నారిని వాగుదాటించిన కానిస్టేబుల్ తిరుపతిరావు

ములకలపల్లి, జూలై 18: ములకలపల్లి మండలంలోని జగన్నాథపురం నుంచి రాచన్నపేటకి వెళ్లే దారిలో ముత్యాలంపాడు వాగుపై ఉన్న డైవర్షన్ రహదారి వర్షం వరదతో మళ్లీ కొట్టుకొనిపోయింది. రాచన్నపేటలో కురిసిన వర్షానికి డైవర్షన్ కొట్టుకుపోవడంతో రాచన్నపేట-జిన్నలగూడెంతో పాటుతో పాటు ఆరు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వరద ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోవడంతో రాచన్నపేట గ్రామానికి చెందిన కుంజా నీలమ్మ 11నెలల బాబు శ్రీహన్‌కి బుధవారం రాత్రి నుంచి జ్వరం వస్తుంది. ముత్యాలంపాడు అప్రోచ్ రోడ్డు తెగిపోవడంతో ఆసుపత్రికి తీసుకెళ్లడానికి ఇబ్బంది ఉండటంతో వాగు వద్ద ఉన్న పోలీస్‌కానిస్టేబుల్ తిరుపతిరావు ఎక్స్‌కవేటర్‌తో అప్రోచ్ రోడ్డులో రాళ్లు పోయించి బాలుడిని అప్రోచ్‌రోడ్డు దాటించి ఆసుపత్రి పంపించారు. కానిస్టేబుల్ తిరుపతిరావును గ్రామస్థులు, తల్లిదండ్రులు అభినందించారు.



చిన్నారిని వాగుదాటిస్తున్న కానిస్టేబుల్ తిరుపతిరావు

కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా ఉపేందర్



ఉపేందర్‌కు ఎన్నిక పత్రాన్ని అందజేస్తున్న డైరెక్టర్లు

కామేపల్లి, జూలై 18: కామేపల్లి పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా పుచ్చకాయల వీరభద్రం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం సొసైటీ కార్యాలయంలో సొసైటీ ఎన్నికల అధికారి సందీప్ కుమార్ ఆధ్వర్యంలో చైర్మన్ ఎన్నికను నిర్వహించారు. పీఏసీఎస్ పరిధిలో 13 మంది డైరెక్టర్లకు గాను, 11మంది హాజరయ్యారు. చైర్మన్ పదివికి పుచ్చకాయల వీరభద్రం మాత్రమే నామినేషన్ వేశారు. పోటీలో ఒక్కరే ఉండడంతో ఆయనను చైర్మన్‌ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గింజల నర్సింహరెడ్డి, ఎంపీటీసీలు నల్లమోతు లక్ష్మయ్య, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, ఏపూరి మహేందర్, దమ్మలపాటి సత్యనారాయణ, గుజ్జర్లపూడి రాంబాబు తదితరులున్నారు.

108 వాహనంలో ప్రసవం

● తల్లీ, బిడ్డ క్షేమం

అశ్వాపురం, జూలై 18: 108వాహనంలోనే మహిళ బిడ్డకు జన్మనిచ్చిన సంఘటన గురువారం మండల పరిధిలోని మారుమూల బట్టీలగుంపులో చోటుచేసుకుంది. బట్టీలగుంపు శివారు రాంనగర్ గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ కౌసల్య పురిటి నొప్పులతో బాధపడుతుండగా, కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారమందించారు. వెంటనే స్పందించిన సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. మహిళను వాహనంలో ఎక్కించిన అనంతరం నొప్పులు తీవ్రం కావడంతో ఈఎంటీ సుజాత, ఆశాకార్యకర్త శోభారాణిలు కౌసల్యకు వాహనంలోనే సాధారణ ప్రసవం చేయించారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. 108సిబ్బందిని గ్రామస్థులు అభినందించారు.



108లో బిడ్డకు జన్మనిచ్చిన తల్లి

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

కరకగూడెం, జూలై 18: భద్రాద్రి జిల్లా కరకగూడెం మండలంలో గురువారం విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతి చెందాడు. కరకగూడెం మండలం సమత్‌మోతే పంచాయతీ గొడుగుబండ గ్రామానికి చెందిన కొమరం రామనాధం అనే వ్యక్తి పొలాన్ని కొత్తూరు గ్రామానికి చెందిన మోకాళ్ల పాపారావు అనే రైతు కౌలుకు తీసుకున్నాడు. ఈ క్రమంలో ఆ పొలానికి సంబంధించిన మోటార్ వైర్ల మరమ్మతుల కోసం గురువారం రైతు పాపారావు మోటార్ మెకానిక్ అయిన తన అల్లుడు పాయం సురేష్‌తో పాటు అతడి కుమారుడు ప్రశాంత్, ప్రశాంత్ స్నేహితుడు ఇర్ప సాకేత్(20)ను తీసుకెళ్లాడు. అయితే అక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆన్‌ఆఫ్ లివర్ పనిచేయకపోవడంతో గతంలో విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌పార్మర్‌ను డైరెక్ట్ చేసినట్లు సమాచారం.. ఈ విషయం తెలియక లివర్ ఆఫ్ చేసి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని భావించిన ఇర్ప సాకేత్ విద్యుత్ తీగను పట్టుకోవడంతో షాక్ తగిలి అక్కడే పడిపోయాడు. వెంటనే పక్కన ఉన్నవారు 108కి సమాచారం అందించి కరకగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యాధికారి మధు అతడిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయంపై కరకగూడెం విద్యుత్‌శాఖ ఏఈ నరేందర్‌రెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇవ్వకుండా విద్యుత్ తీగలను పట్టుకోవడం వల్లనే ఈ ప్రమాదం జరగిందని తెలిపారు. మృతుడు తండ్రి బాబు(అలియాస్ గాంధీ) ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్షకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు.

సర్వేలో మాయమైన

వేలాది భగీరథ నల్లాలు?

- రూ.కోట్లల్లో నిధుల స్వాహా!



దుమ్ముగూడెం, జూలై 18: మిషన్ భగీరథ ఇంటింటి నల్లాల సర్వేలో వేలాది సంఖ్యలో నల్లాలు క్షేత్రస్థాయిలో కనిపించలేదని సమాచారం. కొద్ది రోజులుగా పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్న సర్వే ఈనెల 18న ముగిసింది. మిషన్ భగీరథ అధికారులు ఇచ్చిన నివేదికకు, పంచాయతీ కార్యదర్శుల సర్వేకు పొంతన లేకుండా పోయినట్లు కనబడుతోంది. పంచాయతీ కార్యదర్శులకు సమాచారం లేకుండా మల్టీ పర్పస్ వర్కర్లను ప్రలోభపెట్టి వేయకుండా, వేసినట్లు అదనపు నల్లాలను అప్‌లోడ్ చేయించేందుకు కొందరు మిషన్ భగీరథ అధికారులు ప్రయత్నించినట్లు సమాచారం. సర్వే యాప్‌లోని సాంకేతిక లోపాన్ని ఆసరాగా తీసుకొని కొన్ని పంచాయతీల్లో వేయకుండానే వేసినట్లు అదనంగా వేలాది నల్లాలను అప్‌లోడ్ చేయించారు.

మా ప్రమేయం లేదు: కార్యదర్శులు

ఐతే ఇది తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శులు తాము క్షేత్రస్థాయిలో పరిశీలించిన నల్లాల వివరాలతోపాటు, యాప్‌లో తమ ప్రమేయం లేకుండా జరిగిన అదనపు నల్లాల అప్‌లోడ్‌పై ఎంపీడీవోకు ఇటీవల ఫిర్యాదు చేశారు. తాము సర్వే చేసిన నల్లాల వివరాలను ఎంపీడీవోకు అందజేశారు. ఐతే ఇద్దరు ముగ్గురు కార్యదర్శుల యాప్ నుంచి మాత్రం కొన్ని అదనంగా అప్‌లోడ్ అయినట్లు సమాచారం. మండల వ్యాప్తంగా మొత్తం 11,900 ఇంటింటి నల్లాలు వేసినట్లు అధికారులు చెబుతుండగా, సర్వే అనంతరం సుమారు 4,500ల వరకు లెక్కలో తేడా ఉన్నట్లు సమాచారం. భగీరథ లెక్కల ప్రకారం ఒక్కో నల్లా నిర్మాణ వ్యయం రూ.4,500లని తెలుస్తోండగా, సుమారు రూ.2కోట్ల వరకు నిధులు దుర్వినియోగం అయినట్లు వినికిడి. నీటిని ఎక్కించకుండానే ట్యాంకులకు ఎక్కించినట్లు నివేదికల్లో చూపడం, గ్రామస్థులెవరైనా ప్రశ్నిస్తే నీళ్లు ఎక్కించడం వరకు మాత్రమే తమ బాధ్యత అని, ట్యాంక్ నుంచి గ్రామాలకు ఇవ్వాల్సిన బాధ్యత పంచాయతీలదేనని తప్పించుకున్నారనే ఆరోపణలున్నాయి. అలాగే గ్రామాల్లో వేసిన కొన్ని పైపులైన్ల నిర్మాణాలకు అటు భగీరథ పథకం నుంచి, ఇటు గ్రామపంచాయతీల నుంచి ఒకే పనికి రెండు చోట్ల బిల్లులను డ్రా చేసినట్లు సమాచారం. మండల వ్యాప్తంగా జరిగిన మిషన్ భగీరథ పనులపై సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తే రూ.కోట్లాదిల కుంభకోణం బయటపడే అవకాశాలున్నాయనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి.

ఈ విషయమై ఎంపీడీవోను వివరణ కోరగా, ఇంకా పూర్తిస్థాయి నివేదిక తనకు అందలేదన్నారు. డీఈ శ్రీనివాసరావును వివరణ కోరగా, నల్లాల సర్వేలో అంత తేడా రాకపోవచ్చన్నారు. కాంట్రాక్టర్లకు సుమారు ఎనిమిది వేల నల్లాలకు మాత్రమే బిల్లులో ఎనభైశాతం చెల్లించామన్నారు. ఏమైనా బేధాలు ఉంటే బిల్లులు తీసుకున్న కాంట్రాక్టర్ లేదా సంబంధిత ఏఈ నుంచి నగదు రివకరీ ఉంటుందన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

● పలువురు మహిళలకు గాయాలు

వైరా జూలై 18: మండలంలోని కేజీ పినపాక గ్రామంలో గురువారం ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. ఇద్దరు మహిళలను, పశువులను గాయపరిచి చివరికి గ్రామస్థుల చేతిలో హతమైంది. ఉదయాన్నే ఇంటి ముందు ముగ్గువేస్తున్న సూర్యదేవర సుశీల అనే మహిళను కరిచి పారిపోయింది. ఆ తరువాత మళ్లీ తేళ్లపుట్ట వెంకమ్మను, పలు పశువులను గాయపరచి పారిపోతుండగా, గ్రామస్థులు వెంబడించి హతమార్చారు.

చెక్ బౌన్స్ కేసులో వ్యక్తికి 6 నెలల జైలు

మణుగూరుటౌన్, జూలై 18: చెక్ బౌన్స్ కేసులో వ్యక్తికి 6 నెలల సాధారణ జైలు శిక్షతో పాటు, ఫిర్యాదు దారుడికి రూ.4 లక్షలు పరిహారంగా చెల్లించాలని లేని పక్షంలో మరో నెల రోజులు జైలు శిక్షను విధిస్తూ మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కంభపు సూరిరెడ్డి గురువారం తీర్పునిచ్చారు. ఇందుకు సంబంధించి వివరాల ప్రకారం... ముత్యాలమ్మనగర్‌కు చెందిన కే. కాంతయ్య వద్ద సొంత అవసరాల నిమిత్తం పీ. కృష్ణమూర్తి రూ.4 లక్షలు తీసుకున్నాడు. కొంత కాలం తర్వాత డబ్బులు ఇవ్వాలని అడగగా అతడు కాంతయ్యకు చెక్ ఇచ్చాడు. నగదు కోసం చెక్‌ను బ్యాంక్‌లో జమ చేయగా ఖాతాలో నగదు లేదంటూ బ్యాంక్ అధికారులు చెక్‌ను రిటర్న్ చేశారు. ఈ విషయమై బాధితుడు మణుగూరు కోర్టులో కృష్ణమూర్తిపై లీగల్ నోటీస్‌ను వేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఫిర్యాదుదారుడి తరపున ఎస్‌పీ రమణారెడ్డి కేసు వాదించారు.

ప్రమాదానికి గురైన లారీలు

తల్లాడ, జూలై 18: తల్లాడ మండలంలో గురువారం వేర్వేరుగా రెండు లారీలు ప్రమాదానికి గురయ్యాయి. మండలంలోని నారాయణపురం సమీపంలో తల్లాడ-వరంగల్ జాతీయ రహదారిలో గాలి ఉధ్రుతికి ప్రధాన రహదారి పక్కన ఆగి ఉన్న లారీపై చెట్టుకొమ్మలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో లారీ క్యాబిన్ ధ్వంసమైంది. ఇదిలా ఉండగా నూతనకల్ వద్ద తల్లాడ-దేవరపల్లి జాతీయ ప్రధాన రహదారిలో ఉల్లిగడ్డల లోడ్‌తో ఉన్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాలకు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదాల్లో ఎవరు గాయపడకుండా సురక్షితంగా బయటపడ్డారు.





సందర్శకులపై అటవీశాఖ అధికారి వీరంగం

- యువకులపై దాడి చేసిన వీడియో వైరల్
- కిన్నెరసాని జింకలపార్క్ వద్ద ఘటన

పాల్వంచ, జూలై 18: విధుల్లో ఉన్న అటవీశాఖ అధికారి బుధవారం వీరంగం సృష్టించాడు. కిన్నెరసాని జింకలపార్కు వద్ద ఏర్పాటు చేసిన అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద సందర్శకులపై లాఠీ ఝుళిపించాడు. అనంతరం ఇరు వర్గాల వారు పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడం, పోలీసులు సంధి కుదర్చడం చకచకా జరిగిపోవడంతో అందరూ వ్యవహారం సద్దుమణిగిందనుకున్నారు. కానీ ఆ యువకులు తీసిన వీడియో గురువారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో అందరి దృష్టి ఆ వీడియోపై పడింది. స్థానికులు, అటవీశాఖ అధికారుల కథనం ప్రకారం...

మండలంలోని కిన్నెరసాని జింకల పార్కు వద్ద అటవీశాఖ అధికారులు ఎన్నో ఏండ్ల క్రితమే చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. కిన్నెరసాని జలాశయాన్ని సందర్శించడానికి వచ్చే వారిని తనిఖీ చేయడం, వారి వద్ద నుంచి నామమాత్రపు రుసుము (ఎంట్రీ ఫీజ్) వసూలు చేసి వారిని లోనికి అనుమతించడం, అక్కడున్న అటవీశాఖ అధికారుల పని. సదరు చెక్‌పోస్టులో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న రవి కుమార్ గురువారం విధుల్లో ఉండగా, లక్ష్మీదేవిపల్లి మండలానికి చెందిన ఆరుగురు యువకులు కిన్నెరసాని సందర్శన కోసం మూడు ద్విచక్రవాహనాలపై వచ్చారు. రెండు ద్విచక్రవాహనాలపై నలుగురు యువకులు టికెట్ తీసుకోకుండానే, చెక్‌పోస్ట్ సిబ్బంది వారిస్తున్నా పట్టించుకోకుండా, డ్యాం పైకి వెళ్లిపోయారు. వెళుతూ వెళుతూ వెనక వచ్చేవారు టికెట్ తీసుకుంటారని చెప్పుకుంటూ వెళ్లిపోయారు. దీంతో మూడవ వాహనాన్ని సిబ్బంది నిలిపివేశారు. టికెట్‌లు తీసుకోవాలని అడగడంతో ఇద్దరు యువకులు అక్కడే కొద్దిసేపు వేచి ఉండి వెనుదిరుగుతుండటంతో రంగప్రవేశం చేసిన బీట్ ఆఫీసర్ రవికుమార్ ఓ యువకుడి వద్ద నుంచి సెల్‌ఫోన్‌ను లాక్కొన్నాడు. దీంతో యువకులు వేరే ఫోన్‌నుంచి తమ స్నేహితులకు ఫోన్ చేసి అక్కడకు రమ్మన్నారు. ఈ మధ్యలో చెక్‌పోస్ట్ సిబ్బందికి, ఇద్దరు యువకులకు మధ్య వాదనలు జరిగాయి. అక్కడకు చేరుకున్న యువకులు అందరూ కలిసి అధికారి గదిలోకి ప్రవేశించడానికి ప్రయత్నించడంతో రవికుమార్ వారిపై లాఠీతో దాడి చేశాడు. తమ స్నేహితులపై దాడి చేస్తున్న ఘటనను ఓ యువకుడు సెల్‌ఫోన్లో చిత్రీకరించిన వీడియో, సంధి కుదిరిన తరువాత కూడా అది బయటకు రావడంతో అది కాస్తా వైరల్ అయ్యింది. దీంతో పాటు ఫిర్యాదును బీట్ ఆఫీసర్ వెనక్కుతీసుకోవడంతో ఇరువైపులా తప్పు జరిగి ఉంటుందని భావించిన అధికారులు విచారణ చేపట్టారు. రేంజి అధికారి శ్రీనివాసరావును వివరణ కోరగా ఈ విషయంపై విచారణ నిర్వహిస్తున్నామని తెలిపారు.



యువకులపై లాఠీతో దాడి చేస్తున్న బీట్ ఆఫీసర్ రవి

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
శుక్రవారం 19 జూలై 2024

ఇల్లెందులో పోలీసుల కార్డెన్ సెర్చ్

ఇల్లెందుటౌన్, జూలై 18: ఇల్లెందు పట్టణం సమీపంలోని ఆజాద్‌నగర్ కాలనీలో గురువారం తెల్లవారుజామున పోలీసులు నాకాబందీ కార్యక్రమం నిర్వహించారు. ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, సీఐ బత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో సుమారు 60మంది పోలీసులు ఒకేసారి ఆకస్మాత్తుగా ప్రతి ఇంటికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఎలాంటి పత్రాలులేని 50వాహనాలను సీజ్‌చేశారు. అనంతరం డీఎస్పీ చంద్రభాను మాట్లాడుతూ కొత్తగా వచ్చే వ్యక్తులు, అనుమానితుల సమాచారంతో పాటు మాదకద్రవ్యాలు, గుట్కా, సారాయి వంటి సమాచారాలను అందించాలని సూచించారు. అనుమతులు లేకుండా వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సబ్‌డివిజన్ పరిధిలోని పలువురు ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వర్షపు నీరు పోయే దారేదీ..?

ప్రధాన రహదారిపై భారీగా చేరిన వర్షపు నీరు

ఇళ్లను చుట్టిముట్టిన వర్షపు నీరు

చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే

భద్రాచలం, జూలై 18: భద్రాచలం-చర్ల రహదారిలోని రాజుపేట వద్ద ప్రధాన రహదారిపై నాలుగు అడుగుల లోతులో వర్షపు నీరు భారీగా చేరింది. బుధవారం రాత్రి భారీగా వర్షం కురియడంతో ఫలితంగా ప్రధాన రహదారిపై వర్షపు నీరు చేరడంతో వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. అంతే కాదు ఆ ప్రాంతంలో ఇరు వైపులా ఉన్న ఇళ్ల చుట్టూ వర్షపు నీరు చేరగా కొంత మంది ఇళ్లల్లోకి నీరు సైతం ప్రవేశించింది. దీంతో వారి అవస్థలు అంత ఇంత కాదు. ఈ విషయం తెలిసి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆ ప్రాంతానికి వెళ్లి చూసి వర్షపు నీరు వెళ్లేలా చర్యలు చేపట్టాలని గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించారు. దీంతో గ్రామ పంచాయతీ అధికారులు సిబ్బంది డోజర్ సహాయంతో నీరు వెళ్లేందుకు మార్గం సుగమం చేశారు.

అనుమతి లేకుండా నిర్మాణాలు

భద్రాచలం-చర్ల ప్రధాన రహదారిలో గత కొన్నేళ్లుగా ఎటువంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలువురు రాజకీయ నాయకుల భవనాలు సైతం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో గతంలో వర్షపు నీరు పోయేందుకు ఉన్న కాల్వను మూసివేయడంతో నీరు పల్లపు ప్రాంతంలో వెళ్లేందుకు అవకాశం లేక పూర్తిగా రహదారిపైకి వస్తోందని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. కనీసం వర్షపు నీరు పోయేందుకు సైతం కాల్వలు ఇక్కడ లేకుండా చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడిందనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కాగా కొంత మంది వ్యాపారులు తమ స్వప్రయోజనాల కోసం ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టడంతో డ్రైనేజీ వ్యవస్థ పాడైపోయిందని ఇందుకు గ్రామ పంచాయతీ అధికారులే కారణమని ఆ ప్రాంత వాసులు పేర్కొంటున్నారు.


రాజుపేట ప్రధాన రహదారిపై వర్షపు నీరు


పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

డ్రైనేజీల నిర్మాణానికి స్థలం వదలండి: ఎమ్మెల్యే

ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టడంతో వర్షపు నీరు వెళ్లేందుకు డ్రైనేజీలు లేక రహదారిపైకి వర్షపు నీరు వచ్చి చేరింది. ఇప్పటికైనా ఈ ప్రాంత వాసులు తమ ఇంటి స్థలంలో కొద్ది భాగాన్ని డ్రైనేజీ నిర్మాణంకు స్థలం వదలాలని లేదంటే గోదావరి వరదతో కాదు డ్రైనేజీ నీళ్లతో నే మునిగిపోయే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. నీటి ప్రవాహానికి అడ్డుగా నిర్మాణాలు చేపట్టినందుకు 16 మందికి నోటీసులు జారీ చేస్తున్నామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు.

కలెక్టర్ పర్యటనలో సమస్యల వెల్లువ


కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న ప్రజలు

చండ్రుగొండ, జూలై 18: గృహజ్యోతి పథకం అమలు తీరును పరిశీలించేందుకు గురువారం మండలానికి వచ్చిన కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముంగిట సమస్యలు వెల్లువెత్తాయి. దామరచర్లలో గృహజ్యోతి పథకం అమలును పరిశీలించి లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్న అనంతరం కలెక్టర్ ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలు కలెక్టర్‌కు ఏకరవు పెట్టారు. అత్యధికులకు గ్యాస్ సబ్సిడీ అందటంలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై గ్యాస్ డీలర్‌ను వివరణ కోరుతూ సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. అదే విధంగా గిరిజన బాలికల పాఠశాలలోని మూత్రశాలల నుంచి వచ్చే నీరు డ్రైయినేజీ లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఎంపీడీవో అశోక్ కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో పాటు చండ్రుగొండ జిల్లా పరిషత్ పాఠశాలలో వర్షం నీరు బయటకు పోకపోవటంతో తరగతి గదుల్లోకి నీరు చేరుతుందని ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. వెంగళావు ప్రాజెక్టు అలుగు తాత్కాలిక మరమత్తులకు నిధులు కేటాయించాలని రైతులు కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ప్రతిపాదనలతో తనవద్దకు రావాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కాగా అత్యంత వివాదాస్పదంగా నెలకున్న చండ్రుగొండ నుంచి జూలూరుపాడు రోడ్డు డ్రైయినేజీ నిర్మాణం జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కలెక్టర్‌ను చుట్టుముట్టారు. ఇరువైపులా 30 అడుల వద్ద డ్రైయినేజీ నిర్మించాలని, దీనివల్ల ఇళ్లు కోల్పోతున్న వారి జాబితా తయారు చేసి తనకు ఇవ్వాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు.

రుణ మాఫీపై బ్యాంకర్లతో కలెక్టర్ సమీక్ష

కొత్తగూడెం: రైతురుణమాఫీ పథకం జిల్లాలో అమలుపై అన్ని బ్యాంకుల అధికారులతో గురువారం కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో లక్ష రూపాయల లోపు రుణాల మాఫీ కింద 28018 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు తెలిపారు. అన్ని బ్యాంకుల అధికారులు రుణమాఫీ డబ్బులను రైతులకు అందించాలని, మరే ఇతర రుణాలకు ఈ డబ్బులను నిలుపుదల చేయరాదని బ్యాంకు అధికారులను ఆదేశించారు. రుణమాఫీ పథకం కింద భూమి కలిగి ఉనన రైతు ప్రతి కుటుంబానికి రూ. 2లక్షల వరకు రుణమాఫీ వర్తిస్తుందని తెలిపారు. 12డిసెంబరు 2018వ తేదీన లేదా ఆ తర్వాత మంజూరు అయిన లేక రెన్యూవల్ అయిన రుణాలకు, 9 డిసెంబరు2023 నాటికి బకాయి ఉన్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. రైతు రుణమాఫీ పథకంలో భాగంగా లక్ష రూపాయల లోపు రుణాలు అన్ని మాఫీ అవుతాయని తెలిపారు. పంట రుణమాఫీ పథకం గుర్తించి సందేహాలు, ఇబ్బందుల పరిష్కారానికి పరిష్కార విభాగం ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు.

సంబురాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే


సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దుమ్ముగూడెం, జూలై 18: నరసాపురం రైతువేదికగా గురువారం నిర్వహించిన రుణమాఫీ సంబురాల్లో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని ఆసక్తిగా తిలకించారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కొక్కటిగా అమలు చేసి చూపుతున్నారని తెలిపారు. మండలంలో రెండువేల మందికిపైగా రైతులు రూ.లక్షలోపు రుణమాఫీ లబ్ధిపొందుతారని అన్నారు. ఏడీఏ సుధాకర్, ఎంపీడీఓ ముత్యాలరావు, ఏవో నవీన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో సౌకర్యాలు కల్పిస్తాం

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

చుంచుపల్లి, జూలై 18: ప్రభుత్వ విద్య సంస్థల్లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక కనీస వసతులు కల్పిస్తామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. గురువారం చుంచుపల్లి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీసీ రోడ్డు, బోరు నిర్మాణాలకు శంకుస్థాపనలు చేసి మాట్లాడారు. కళాశాలలో అదనపు తరగతి గదులు, ల్యాబ్‌ల కోసం నూతన భవనాల నిర్మాణానికి నిధులను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రూ. 5 లక్షల నిధులతో నిర్మిస్తున్న ఈ నూతన రోడ్డు, బోరు పనులను తక్షణమే పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్యను సక్రమంగా అందిస్తూ ప్రభుత్వ విద్యపై నమ్మకాన్ని పెంచాలన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో నిరుపేదలు మాత్రమే చదువుతారనే భావన తొలిగినప్పుడే ప్రభుత్వ విద్య సంస్థలు బలోపేతం అవుతాయన్నారు. జూనియర్ కళాశాలతో పాటు, పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ కళాశాలలు, పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, నూతన భవనాలను నిర్మించేందుకు ప్రతిపాధనలు సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలను నాటి నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, కౌన్సిలర్‌లు కంచర్ల జమలయ్య, ధర్మరాజు, పల్లపు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

కాంగ్రెస్ పార్టీది రైతు ప్రభుత్వం: పాయం


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం

పినపాక, జూలై 18: రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి రుణ మాఫీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీది రైతు ప్రభుత్వమని మరోసారి నిరూపించుకుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల కేంద్రంలో రైతు వేదిక వద్ద నిర్వహించిన రైతు రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా నిధుల విడుదల కార్యక్రమాన్ని రైతులతో కలసి వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో తహాశీల్దార్ సూర్యనారాయణ, వ్యవసాయ శాఖ ఏడీఏ తాతారావు, వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, ఏవో వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జీ రామనాథం, విద్యుత్ శాఖ ఏఈ కావ్య, ఎంపీటీసీ హరీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, కె.లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆశాల వినతి


వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

మణుగూరుటౌన్, జూలై 18: ఆశ వర్కర్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ.. ఆశ వర్కర్లు గురువారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతి పత్రమందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశ వర్కర్‌లు 15 రోజలపాటు చేసిన సమ్మె సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

మాదక ద్రవ్యాల వినియోగం నేరం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 18: మాదక ద్రవ్యాల వినియోగం చట్ట ప్రకారం నేరమని, వాటిని ప్రోత్సహించిన, సరఫరా చేసిన, నిల్వ ఉంచిన, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ హెచ్చరించారు. గురువారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సును నిర్వహించి మాట్లాడారు. డ్రగ్స్ మనిషి జీవితాన్ని చెల్లా చెదురు చేస్తాయని, తాత్కాలిక ఉపశమనం కోసమే డ్రగ్స్‌ను ఆశ్రయించి సేద తీరుతున్నారని అన్నారు. మాదక ద్రవ్యాలకు శాశ్వతంగా బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని గుర్తు చేశారు. విద్యార్థి దశలో మాదక ద్రవ్యాల ఉత్పత్తులపై అవగాహన కలిగి ఉండి ఇతరులకు మార్గదర్శకంగా నిలవాలని సూచించారు. బాలికలు, మహిళల అపహరణ, సైబర్ నేరాలు, చైల్డ్ మ్యారేజ్‌లు, మానవ అక్రమ రవాణ, ర్యాగింగ్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. అదేవిధంగా కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ రమేష్‌కుమార్ రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో అవగాహన సదస్సును ఏర్పాటు చేసి వారికి సూచనలు చేశారు. త్రీటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో సీఐ శివప్రసాద్ పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాలపై ఉక్కు పాదం మోపేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని నినాదాలు చేశారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు

చుంచుపల్లి, జూలై 18: రైతు శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. గురువారం జడ్పీ కార్యాలయ సమావేశ హాల్లో రైతు రుణ మాఫీ నిధుల విడుదల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డితో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని వీక్షించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం 2019 ఎన్నికల వాగ్ధానాలలో భాగంగా రైతులకు రూ.లక్ష లోపు ఉన్న బ్యాంకు రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించిందన్నారు. రైతుల శ్రేయస్సు విస్మరించి రుణ మాఫీని చేయకుండా రైతులను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. రుణ మాఫీ జిల్లాలో ప్రతి రైతు కల్లల్లో ఆనంద బాష్పాలు వికసిస్తున్నాయని అన్నారు. రైతును రాజులుగా చేయాలన్నదే కాంగ్రెస్ సంకల్పమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అంటే రైతులకు ఎనలేని నమ్మకమని, అందుకు నిదర్శనమే ఈ రుణ మాఫీ నిలుస్తుందని కొనియాడారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కంచర్ల

కోలాహలంగా రైతు రుణమాఫీ పండుగ


జిల్లాలో మొత్తం 28,018మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కోనేరు చిన్ని

కొత్తగూడెం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ పథకం కింద రూ.2 లక్షలను మాఫీ చేస్తోంది. దీనిలో భాగంగా గురువారం మొదటి దఫా ఒక్కొక్క రైతు కుటుంబానికి లక్షరూపాయల చొప్పున జమచేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా రైతులు పండుగ చేసుకున్నారు. అయా నియోజకవర్గాల్లో రైతులు వ్యవసాయశాఖాధికారులు, జిల్లా అదికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు రైతుల రుణమాఫీ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అశ్వారావుపేట నియోజకవర్గంలోమాత్రం భారీ వర్షాలు రావడం వల్ల రుణమాఫీ సంబరాలు జరుపుకోలేకపోయారు. మిగిలిన నాలుగు నియోజకవర్గాల్లో రైతుల రుణమాఫీ సంబరాలు జరుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,78,018మంది రైతులు మొదటి దఫా కింద రుణమాఫీ పొందారు. మిగిలిన రుణం లక్షన్నర లోపు ఈ నెలాఖరుకల్లా జమచేయనున్నారు. మిగిలిన రూ.2లక్షలు ఆగస్టు 15వ తేదీన ప్రభుత్వం రైతులకు జమచేసేందుకు సిద్ధమైంది. కొత్తగూడెం నియోజకవర్గంలో కోనేరు సత్యనారాయణ (చిన్ని) ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రైతులకు స్వీట్లు పంపిణీ చేశారు.

పొంగి పొర్లు తున్న తాలిపేరు

12గేట్లు ఎత్తివేత..14వేల474 క్యూసెక్కుల నీరు విడుదల


తాలిపేరులో నీటి ప్రవాహం

చర్ల, జూలై 18: ఛత్తీస్‌గఢ్‌తో పాటు, చర్ల మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తింది. గురువారం ప్రాజెక్టు 12 గేట్లను పూర్తిగా ఎత్తివేసి, 14వేల 474క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గత నాలుగు రోజులుగా చర్ల మండలం తోపాటు సరిహద్దునున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. పామేడులోని చింతవాగు, చర్ల మండలంలోని రోటింత వాగు, జెర్రిపోతుల, తరివాగు, ఈతవాగులు వాగులు పొంగి పొర్లు తున్నాయి. దీంతో తాలిపేరు ప్రాజెక్టులోకి గంట గంటకూ వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పరిస్థితిని డీఈ తిరుపతి, ఏఈ శ్రీనివాసరావు సమీక్షిస్తున్నారు. ప్రాజెక్టు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సెన్సార్స్ వరద నీటిని అంచనా వేస్తున్నాయి. ప్రాజెక్టు వద్ద ప్రస్తుత నీటి మట్టం 72.54 మీటర్లు కాగా, ఇన్‌ఫ్లో 20,224 క్యూసెక్కులుగా ఉంది.

'స్పాంజ్ ఐరన్ యూనిట్‌ను పునరుద్ధరించాలి'

పాల్వంచ, జూలై 18: స్పాంజ్ ఐరన్ యూనిట్‌ను పునరుద్ధరించాలని సెల్ యూనిట్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి బాలూ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఖమ్మంలో రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, ఖమ్మం ఎంపీ రఘు రాంరెడ్డిలను కలసి వినతిపత్రాలను అందజేశారు. స్పాంజ్ ఐరన్ యూనిట్‌ను సునరుద్దరించి ఇండక్షన్ ఫర్నెస్ రీ లోడింగ్ మిల్‌ను ఏర్పాటు చేయడం ద్వారా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాల కోరారు. ఈ కార్యక్రమంలో స్పాంజ్ ఐరన్ పాల్వంచ సెల్ యూనిట్ ఐఎన్‌టీయూసీ యూనియన్ ప్రధాన కార్యదర్శి బాలు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జలీల్, కాంగ్రెస్ నాయకులు రవి నాయక్, పాల్వంచ పట్టణ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి శనగ రాంచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వాములు కావాలి

జూలూరుపాడు, జూలై 18: మాదక ద్రవ్యాలను వినియోగించి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఏఎస్సై బి.తిరపతిరావు అన్నారు. గురువారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వెంగన్నపాలెంలో సెయింట్ ఆంథోని, సాధన జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల సంభవించే అనర్థాలు, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనలో విద్యార్థులు భాగస్వామ్యులు కావాలని కోరారు. డ్రగ్స్ వినియోగం చట్టరీత్యా నేరమన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగివుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అర్జీ, పోలీస్ సిబ్బంది వెంకటేశ్వర్లు, ప్రసాద్, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ అభినందనీయం

ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందుటౌన్, జూలై 18: రైతుల సంక్షేమం కోసం పనిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చరిత్రాత్మకంగా రూ.2లక్షలు రుణమాణమాఫీ చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గురువారం రైతురుణమాఫీ, రైతునేస్తం కార్యక్రమం ఇల్లెందు మండలం సుదిమళ్ల రైతువేదికలో నిర్వహించారు. ముందుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సందేశాన్ని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రైతులకు వినిపించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ రెండు లక్షల రూపాయల రుణమాఫీ రైతులకు ఎంతో మేలు చేకూరుస్తుందని అన్నారు. రైతుల సంక్షేమం కోసం నిరంతరం సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని వెల్లడించారు. రైతు రుణమాఫీ ద్వారా ఆర్థిక చేయుత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తోట రవికుమార్, ఏడీఏ వాసవీరాణి, ఏవో సతీష్, ఏఈవోలు, మాజీ ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, ఇల్లెందు డీఎస్పీ చంద్రభానుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఎమ్మెల్యే

'కల్యాణలక్ష్మి' ఆర్థిక భరోసా: కూనంనేని

కొత్తగూడెం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలకు, పేదింటి ఆడపిల్లల భవిష్యత్‌కు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం భరోసా అని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం కింద కొత్తగూడెం మున్సిపాలిటి, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాల్లో ఎంపికైన 160 లబ్ధిదారులకు చెక్కులను గురువారం కొత్తగూడెం క్లబ్‌లో అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడబిడ్డలకు వివాహాలు చేయలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ ఒకింత ఆసరగా నిలుస్తుందని అన్నారు. ప్రస్తుతం ఈ పథకానికి అర్హులైన వారికి కూడా తులం బంగారం అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. సంబంధిత అధికారులు దరఖాస్తుల్లో లోటుపాట్లు సరి చేసి అందరికి పథకం అమలయ్యే విధంగా చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

అశ్వారావుపేటలో 16 సెం.మీ వర్షపాతం

జలదిగ్బంధంలో అనంతారం.. రహదారులపైకి భారీగా నీరు..

పలు గ్రామాలకు రాకపోకలకు ఆటంకం.. ప్రజల అవస్థలు

అశ్వారావుపేట, జూలై 18: అశ్వారావుపేట మండలంలో గురువారం తెల్లవారుఝాము నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు 16 సెం.మీ వర్షపాతం నమోదు అయ్యింది. గుబ్బలమంగమ్మ ఆలయం గుట్టల్లో భారీగా వర్షం కురవడంతో పెదవాగు ప్రాజెక్టు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. నారాయణపురంలో 25మంది వాగుల మధ్య చిక్కుకున్నారు. అనంతారం గ్రామం చుట్టు నీరు చేరడంతో ఆ గ్రామం జలదిగ్బంధంలో ఉండి పోయింది. వెంకమ్మచెరువు అలుగుపడి వాగొడ్డుగూడెంవద్ద రోడ్డుపై నుంచి పారి రాకపోకలకు ఆటంకం కలిగింది. ఊట్లపల్లి చెరువు వద్ద రోడ్డుపై నుంచి నీరు పారుతుండటంతో ఊట్లపల్లి- నల్లబాడు మధ్య రాకపోకలు నిలచిపోయాయి. ఊట్లపల్లి- జమ్మిగూడెం మధ్య, నారంవారిగూడెం- గుర్రాలచెరువులకు రాకపోకలు నిలచిపోయాయి. నారంవారిగూడెం- అచుతాపురం మధ్యలోను రాకపోకలు నిలచిపోయాయి. నారాయణపురం, గుమ్మడపల్లి వైపు నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు అవస్థలు పడ్డారు.